క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి : మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదం రత్నాకర్, సామిని రాధాబాయి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నైనకంటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఆరెపల్లి రమేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, టేకుమట్ల మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆది రఘు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

ఆర్థికసాయం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన జెన్‌కోలో ఇంటెక్‌వెల్ ఆర్టిజన్ 3గా విధులు నిర్వర్తిస్తున్న వెన్నపురెడ్డి సందీప్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. బుధవారం గ్రామంలో తోటికార్మికులు ఉన్నతాధికారుల సహకారంతో ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డీఈ, ఏడీఈ, ఏఈలతో పాటు కాటారం, కాళేశ్వరం ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలిమెల : మండలంలోని పంకెన సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పడిన వర్షానికి విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు విరిగిపడగా 33 కేవీ లైన్ తెగిపోవడంతో మండలానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీనిపై ఏఈ మంగీలాల్‌ను వివరణ కోరగా రాత్రి 10 గంటలకు విద్యుత్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు వాహనాల వేలం

కాటారం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు పలు రకాల వాహనాలకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 50 శాతం సొమ్ము ముందస్తుగా చెల్లించి మిగిలిన సొమ్మును వాహనం పొందిన తర్వాత అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

బస్సు సర్వీసులు నడిపించాలి

భూపాలపల్లి రూరల్ : మండలంలోని నేడరేడుపల్లి ప్రజలకు, భూపాలపల్లికి వచ్చే విద్యార్థులకు అనుకూల సమయంలో బస్సు సర్వీసులు నడిపించాలని మాజీ సర్పంచ్ దండు రామస్వామి భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కోరారు. ఈ సందర్భంగా డిపో బయట విద్యార్థినులతో కలిసి ఆయన మాట్లాడారు. డిపో మేనేజర్‌కు బస్సులు సమయ పాలన పాటించే విధంగా చూడాలని కోరగా , సానుకులంగా స్పందించిందని తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

మొగుళ్లపల్లి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శ్రమదానం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్వకర్మ భగవానుడి జయంతి


పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ పురోహితులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విశ్వకర్మ భగవానుడి జయంతిని విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచ వృత్తులకు సంబంధించిన పంచవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పురోహితులు చీర్లవంచ రమేశ్ ఆచార్యులు, వంగల శ్రీనివాస్ ఆచార్యులు, వెంకటేశ్వర్లు ఆచార్యులు భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్ : విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని బుధవారం భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనులో బీఎంఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్ట్–2 ప్రాజెక్టులో నిర్వహించిన కార్యక్రమానికి బీఎంఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరైన విశ్వకర్మ పూజలో పాల్గొని మాట్లాడారు.

పోషణ మాసానికి శ్రీకారం

- అక్టోబర్ 16 వరకు కార్యక్రమాలు
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహణ
- పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ పోషణ స్థాయిని పెంచడమే లక్ష్యం


పోషణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి (ఫైల్)

మొగుళ్లపల్లి : మాతా శిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ప్రభుత్వం పోషణమాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ పోషణస్థాయిని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. పోషణ మాసోత్సవాలు అక్టోబర్ 16న ముగుస్తాయి. ఈ పోషణ మాసంలో గర్భిణులు, బాలింతలతో సమావేశాలను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నారు. స్వయంగా అంగన్‌వాడీలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని వారికి అందించనున్నారు.

పోషణ మాసం కార్యక్రమాలు...

- స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పౌష్టికాహారం పదార్థాల వినియోగంపై అవగాహన.
- గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల పోషణపై సలహాలు, సూచనలు ఇస్తారు. అనుబంధ ఆహారాల తయారీ, వంటకాల పోటీలు.
- కిశోర బాలికలకు వైద్య పరీక్షలతో పాటు పిల్లల బరువు, ఎత్తు కొలతలను తీయడం, ఆహారంలో చక్కెర, నూనె వినియోగం తగ్గించడంపై అవగాహన.
- చిన్నారుల తండ్రులు, సంరక్షులకు అనుబంధ ఆహారంపై పోటీలు, అదే విధంగా తండ్రులతో పోషకాహారం ప్రతిజ్ఞ..
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కథలు చెప్పడం, బొమ్మల ప్రదర్శన, వాటి ద్వారా ఈసీసీఈ సెషన్, 0–3 ఏళ్ల పిల్లల ఆరంభ అభివృద్ధి, ప్రేరణకోసం దృష్టి సారించాల్సిన కార్యక్రమాలు, తల్లిదండ్రులతో చేయించడం.

అంగన్‌వాడీల వివరాలు	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	02
అంగన్‌వాడీ కేంద్రాలు	644
3 ఏళ్ల లోపు పిల్లలు	11973
3 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలు	9691
గర్భిణులు :	2591
బాలింతలు :	16963

- పోషణ లోపం ఉన్న పిల్లలకు ఆరోగ్య, ఆకలి పరీక్షలు, గ్రోత్ మానటరింగ్, పిల్లల బరువు, ఎత్తును కొలవడం.
- బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపడం, పిల్లల అనుబంధ ఆహారంపై అవగాహన.
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన శైలిపై అవగాహన.
- స్థానిక వంటకాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, స్వదేశీ బొమ్మల తయారీ,
- పోషణ మిషన్ 100 రోజుల ప్రచారం, గ్రామ, వార్డు సభలు, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ.
- గృహ సందర్శన, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించడం.

పౌష్టికాహారం పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతంతో పాటు పలురకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా పిల్లల ఎత్తు, బరువు తీసుకుని వారికి అవసరమైన వైద్యపరీక్షలను చేయిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఐదేళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంపూర్ణ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నెలకు 30 గుడ్లు, రోజూ ఒక్కొక్కరికి 200 మిల్లీలీటర్ల పాలను ఇస్తూ మాతాశిశు ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు.

> **పోషణ స్థాయిని పెంపొందించడమే లక్ష్యం..**
>
> గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమపద్ధతిలో తీసుకుంటే మంచిది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, జన్మదిన వేడుకలను కూడా నిర్వ హించనున్నాం. పోషణ స్థాయిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం.
>
> – మల్లీశ్వరి, ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమ అధికారిణి

మధుకు ఏదైనా జరిగితే మంత్రిదే బాధ్యత

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి
- బీఆర్ఎస్ ధర్నా, మంత్రి దిష్టిబొమ్మ దహనం


మంత్రి శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాటారం: బహుజనులకు అండగా నిలిచి వారి హక్కుల కోసం పోరాడుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు ఏదైనా జరిగితే రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అన్నారు. కాటారంలో బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా చేసి మంత్రి శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఏబీవైఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ప్రారంభిస్తే దుద్దిళ్ల కుటుంబం ఓర్చుకోలేకపోయిందన్నారు. మంథనిలో మంత్రి తండ్రి శ్రీపాదరావు విగ్రహాలే ఉండాలే తప్ప మహనీయుల విగ్రహాలు ఉండకూడదా అని ప్రశ్నించారు. దుద్దిళ్ల శ్రీనుబాబు ఏ హోదాలో ఉన్నారని ఇక్కడి అధికారులు ప్రోటోకాల్ ఇస్తున్నారని శ్రీహర్షిణి ప్రశ్నించారు. ధర్నా, మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ధన్వాడలోని మంత్రి శ్రీధర్‌బాబు ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేసి పలిమెల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, జక్కు శ్రావణ్, కాటారం సబ్ డివిజన్‌లోని పలు మండలాల మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వస్థనారీ స్వశక్తి పరివార్‌ను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మొగుళ్లపల్లి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిని డాక్టర్ నాగరాణి కోరారు.బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి మానస, తహసీల్దార్ సునిత, ఎంపీడీఓ సురేందర్, ఎంఈఓ కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇంటింటా స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఈ కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగించుకోవాలని కోరారు. అన్నిరకాల వైద్య పరీక్షలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామస్థాయి నుంచి నగరాల వరకు అన్ని చోట్ల శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల అధికారులు,ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీతకు అభినందన సభ


లింగయ్య–లిఖిత దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జడలపేట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ నూకల లింగయ్యకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం వాసంతి తెలిపారు. సభకు ముఖ్యఅతిథులుగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ సమాజంలో అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. క్రీడలతో పాటు విద్య ఎంతోగానో ఉపయోగ పడేవిధంగా కృషి చేయడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు గ్రహీత లింగయ్య–లిఖిత దంపతులను ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘుపతి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



చిట్యాల: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుంచి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. నాగరాజు, వెంకటేష్, కుమార్, పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులోల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్


మొగుళ్లపల్లి: కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు


చిట్యాల : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


రేగొండ: కొత్తపల్లిగోరిలో కేక్ కట్ చేస్తున్న విష్ణు యాదవ్


కాటారం : మహాముత్తారంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుతున్న బీజేపీ నాయకులు

విమోచన దినోత్సవం

బీజేపీ ఆధ్వర్యంలో బుధవారంజిల్లా వ్యాప్తంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన ఈ రోజు తెలంగాణ బిడ్డలకు నిజమైన స్వాతంత్ర దినోత్సవ రోజు అని కొనియాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్


కాళేశ్వరం : సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


పోలీస్‌స్టేషన్‌లో జెండాను ఎగురవేస్తున్న సీఐ మల్లేశ్


మొగుళ్లపల్లి : జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన ది నోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలు, పోలీస్ స్టేషన్లలో సీఐ, ఎస్సైలు, జీపీ కార్యాలయాల్లో కా ర్యదర్శులు, ఎంఈఓ కార్యాలయాల్లో ఎంఈ ఓలు, ఏఎంసీ కా ర్యాలయాల్లో చైర్మన్లు జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. –సాక్షి, నెట్‌వర్క్


మల్హర్ : జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ రవికుమార్


చిట్యాల : జెండాకు వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


భూపాలపల్లి రూరల్ : జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు


టేకుమట్ల : తహసీల్దార్ కార్యాలయంలో.


పలిమెల: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ప్రకాశ్


కొత్తపల్లిగోరిలో..


భూపాలపల్లి అర్బన్ : మున్సిపల్ కార్యాలయంలో


టేకుమట్ల : పోలీస్‌స్టేషన్‌లో.

సంక్షిప్త సమాచారం

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ – 3లో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రారంభమైన స్వచ్ఛ పక్వాడా

భూపాలపల్లి అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం ఏరియాలో ప్రారంభించారు. ఏరియా సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణకాలనీ సింగరేణి పాఠశాల ఆవరణలో ప్రారంభించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

రేగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెచ్చిన నిధులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు.

ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

కాటారం: స్థానిక గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

మరమ్మతులు వేగవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఏరియా సింగరేణి జనరల్ రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తొమ్మిదేళ్ల పాటు పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌కు కేటాయించిన సింగరేణి కమ్యూనిటీహాల్‌ను బుధవారం జీఎం అధికారులతో కలిసి పరిశీలించారు. క

సాయుధ పోరాట వారోత్సవాల సభ

కాటారం: మండలంలోని ఒడిపిలవంచలో డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటవీరులు సుందరయ్య, ఐలమ్మ, స్వరాజ్యం, కమలాదేవి, నారాయణరెడ్డి, కొమురయ్య, షోయబుల్లాఖాన్, షేక్ బందగీ, మోహినొద్దీన్ తదితర అమర వీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

కాళేశ్వరం పీహెచ్‌సీలో వైద్యశిబిరాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పీహెచ్‌సీలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యశిబిరం గురువారం నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

టేకుమట్ల : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లి శివారు బోయినిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. దీని విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని రైతు తెలిపారు.

జాతీయ సమైక్యతా దినోత్సవం

భూపాలపల్లి అర్బన్ : జాతీయ సమైక్యత దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రజుమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

కాటారం : ఇబ్రహీంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గణేశ్‌నగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ బుధవారం కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT JS BHUPALPALLY.
O.S. No. 245 of 2023
Between:
KUSUMA CHANDRA SHEKAR ... Plaintiff
And
Naragoni Ravinder & another ... Defendants
To,
1. Naragoni Ravinder, S/o Rajamallu, 48 Yrs, Occ: Business, Cell: 9866647578
2. Naragoni Shobha Rani, W/o Ravinder, 40 Yrs, Occ: Household, Both are R/o H.No. 7-43, Reddy Colony, Js Bhupalpally, Cell: 8790227578
Defendants.
NOTICE
Whereas the above named Plaintiff have filed a suit for a suit for recovery of amount of Rs. 7,98,000/- against you. The said case is posted on 11-11-2025 for your appearance at 10.30 A.M before the said court.
Therefore you are hareby directed to appear before the said court along with documents to claim your defense if any. Otherwise the matter will be decided exparte against you.
"By order of the court"
Sd/- K.V.L.N HARI BABU, M.A., LL.B. Advocate
Flat No. 403, CRK's, Manthani Pride Apartment, T.C Katta, Godavari Road, Manthani, Dist. Peddapalli. Cell: 9014222255

మెనూ ప్రకారం భోజనం అందించాలి


అల్పాహారం తయారు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రకాశ్

పలిమెల : ప్రభుత్వ పాఠశాల్లో, గురుకులాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ చల్లా ప్రకాశ్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీచింగ్ స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్, స్టాక్‌రూమ్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు తయారు చేస్తున్న అల్పాహారాన్ని తయారు చేస్తున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట కేజీబీవీ అధ్యాపకులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291